# ఆంటీబయాటిక్ ఔషధాల వాడకం గాడి పప్పుతోందా?!

ఆంటీబయాటిక్స్, ఆంటీమైక్రోబియల్ ఔషధాల పట్ల వ్యాధికారక సూక్ష్మజీవులు లేదా పాథోజెన్స్ నిరోదకశక్తిని పొందడంతో వ్యాధి చికిత్స పెద్ద సమస్యగా అవతరిస్తున్నది. 'నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి)' నిర్వహించిన సర్వే వివరాల ప్రకారం 70 శాతం రోగులకు చికిత్సలో ఆంటీబయాటిక్ ఔషధాలు సూచించబడ్డాయనే ప్రమాదకర విషయం బయట పడింది. సర్వే చేసిన 20 ఆసుపత్రుల్లోకి 13 ఆసుపత్రుల డాక్టర్లు ఆంటీబయాటిక్ ఔషధాలను రోగులకు సూచించారని తెలుస్తున్నది. ఆసుపత్రుల్లో చేరిన రోగులకు అకారణంగా లేదా విచక్షణారహితంగా దుర్వినియోగం చేయడం లేదా అతి మోతాదులో డోసులను ఆంటీబయాటిక్స్ సూచించడం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరించడం గమనార్హం. రోగులతో పాటు జంతువులు, మొక్కలకు ఆంటీబయాటిక్స్ దుర్వినియోగం ప్రాణాంతకంగా, ప్రమాదకరంగా మారుతున్నది. భారత్ లాంటి అధిక పేద జనాభా కలిగిన దేశాల్లో ఏఎంఆర్ సమస్య అధికంగా ఉండడంతో అంటువ్యాధుల వైద్యం కష్టంగా, అత్యంత ఖరీదుతో కూడినదిగా అవుతున్నది.

## ఆంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) సంక్షోభంలో భారతం:

ఇప్పటికే భారత్ లాంటి పలు దేశాల్లో "ఆంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్" పెరగడంతో వ్యాధి చికిత్స కష్టం కావడంతో పాటు వైద్యం ఖరీదు పెరగడం గమనిస్తున్నాం. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం 2019లో ప్రపంచవ్యాప్తంగా 1.27 మిలియన్ల ప్రత్యక్ష మరణాలు, 4.95 మిలియన్ల పరోక్ష మరణాలు ఆంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ పెరగడం వల్ల జరిగాయని విశ్లేషించబడింది. వ్యాధికారకాలు లేదా పాథోజెన్స్ ఔషధాల నిరోధకశక్తి లేదా రెసిస్టెన్స్‌ను కలిగి ఉండడంతో వ్యాధి చికిత్స చాలా కష్టం అవుతున్నట్లు వివరిస్తున్నారు. ఏఎంఆర్ సంక్షోభ గంభీరతను గుర్తించిన వైద్య సమాజం ప్రతి ఏట నవంబర్ 18 - 24 రోజుల్లో ప్రపంచ ఏఎంఆర్ అవగాహన వారాన్ని కూడా పాటిస్తూ సమస్య పట్ల విస్తృత ప్రచారం చేయడం చూస్తున్నాం.

## ఆంటీబయాటిక్స్ దుష్ప్రభావాలు:

ఎన్‌సిడిసి నిర్వహించిన సర్వే వివరాల ప్రకారం ఒక ఆంటీబయోటిక్ ఔషధాన్ని సూచించబడినన రోగులు 72 శాతం, రెండు ఔషధాలు సూచించబడిన రోగులు 25.3 శాతం, మూడు ఔషధాలను సూచించబడిన రోగులు 13 శాతం ఉన్నట్లు తేలింది. ఒకేసారి రెండు లేదా అంత కన్న ఎక్కువ ఆంటీబయాటిక్స్ వాడిన రోగులపై తీవ్రమైన దుష్ప్రభాలు పడతాయని, ప్రాణాంతకంగా కూడా మారవచ్చని హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన అంటువ్యాధుల చికిత్సలో 'బ్రాడ్-స్పెక్ట్రమ్ ఆంటీబయాటిక్స్' సూచించడం, మల్టీడ్రగ్-రెసిస్టెన్స్ అంటువ్యాధుల చికిత్సలో ప్రత్యేక 'రిజర్వ్ ఆంటీబయాటిక్స్'ను వాడడం జరగాలి.

## అతి ఆంటీబయోటిక్స్‌తోనే వైద్యం:

వ్యాధుల చికిత్సలో 33 శాతం మూడవ తరం ఆంటీబయాటిక్స్‌గా 33 శాతం 'సిఫాలోస్పోరిన్' సమూహ ఔషధాలు వాడడంతో పాటు 15 శాతం ఇమిడజోల్స్, 12 శాతం అమైనోగ్లైకోసైడ్స్, 12 శాతం బీటాలాక్టమేజ్ ఇన్‌హిబిటర్స్, 4 శాతం /కార్బాపినెమ్స్ వర్గపు ఆంటీబయాటిక్ ఔషధాలను 40 శాతానికి పైగా విరివిగా వినియోగించడం గమనించారు. అంటువ్యాధి చికిత్సలో 34 శాతం, అంటువ్యాధులను నిరోధించడానికి (ప్రివెన్ట్స్) 55 శాతం, ఇతర కారణాలతో 11 శాతం ఆంటీబయాటిక్స్ వాడడం గమనిస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ఆసుపత్రుల్లో నిర్వహించిన సర్వే వివరాల ప్రకారం యూపీ ఆసుపత్రుల్లో 93 - 100 శాతం, ఎంపీలో 69 - 99 శాతం, బీహార్‌లో 96 శాతం, మహారాష్ట్రలో 73 - 96 శాతం, తెలంగాణలో 66 శాతం, ఏపీలో 62 శాతం రోగులు కనీసం ఒక్క ఆంటీబయాటిక్ ఔషధంతో చికిత్స పొందారని తెలుస్తున్నది.

ఏఎంఆర్ సమస్య తీవ్రతను గుర్తించి రానున్న రోజుల్లో ఆంటీబయాటిక్స్, ఆంటీమైక్రోబియల్ డ్రగ్స్‌ను అవసరాన్ని బట్టి పరిమిత డోసుల్లో వాడడానికి వైద్య సమాజం నడుం బిగించారని కోరుకుంటూ ఏఎంఆర్ కారం మరణాలు లేకుండా ప్రపంచాన్ని చూడాలని ఆశిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఐక్యమత్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం ..ప్రజలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపు



అమరావతి, జనవరి 26:గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు.. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం జగన్ దంపతులు, వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య నిర్మాణంలో ప్రతిఒక్కరి పాత్ర ఉండాలని పేర్కొన్నారు. ఐకమత్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామాల్లో వైద్య సేవలను ప్రతి ఒక్కరికి చేరువ చేయాలనే ఉద్దేశంతో విలేజ్ క్లీనిక్‌లను ప్రారంభించామన్నారు.

రైతుల కోసం 10,778 ఆర్బీకేలను ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పరిపాలన సులభతరం చేయటానికి నూతన జిల్లాలు ఏర్పాట్లు చేసామన్నారు. కుల, మత, ప్రాంతాలకు వ్యతిరేకంగా సంక్షేమ పథకాలు ప్రతి పౌరునికి చేరేలా కృషి చేస్తున్నామన్నారు. పాఠశాలలో నాడు-నేడు పథకంతో అనేక మార్పులు తీసుకువచ్చామని తెలిపారు. పాలన పరంగా అనేక సంస్కరణలు చేశామని వెల్లడించారు..

# ఫిబ్రవరి 3 నుంచి తిరుమలలో శ్రీవెంకటేశ్వర ధార్మిక సదస్సు..



తిరుపతి, జనవరి 26:తిరుమలలో ఫిబ్రవరి 3నుంచి శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం కార్యక్రమం చేపట్టామని, భక్తులు నుంచి అద్భుత స్పందన వస్తోందన్నారు. నడక మార్గంలో చిరుత పులుల దాడుల అడ్డుకట్టకు రూ.5కోట్లు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ వారికి అందించామని టీటీడీ ఈవో చెప్పారు. టీటీడీ పరిపాలన భవనం పెరేడ్ గ్రౌండ్లో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీటీడీ ఈవో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

టీటీడీ ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ 'టీటీడీ తరపున వైకుంఠ ఏకాదశికి 10 రోజుల పాటు 6 లక్షల 50 వేల మంది భక్తులకు దర్శనం చేయించాం. ఫిబ్రవరి 16న రథ సప్తమి వైభవంగా నిర్వహిస్తాం. అయోధ్యలో బాల రాముడు విగ్రహ ప్రతిష్ఠరోజు లక్ష లడ్డూలు స్వామి వారికి అందించాం. 25 ఏళ్లు లోపు వారు గోవింద కోటి పదిలక్షల నూట పదహారుసార్లు రాసి తీసుకువచ్చిన వారికి స్వామి వారి బ్రేక్ దర్శనం కల్పిస్తాం. తిరుమలలో ఫిబ్రవరి 3న శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు నిర్వహిస్తున్నాం. శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం కార్యక్రమం చేపట్టాం. భక్తుల నుంచి అద్భుత స్పందన వస్తోంది.. నడక మార్గంలో చిరుత పులుల దాడుల అడ్డకట్టకు రూ.5కోట్లు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ వారికి అందించాం. రూ.45కోట్లు ఖర్చుతో కండలేరు నుంచి 40 క్యూసెక్కులకు పాలకమండలి ఆమోదం పొందినది. స్వామి వారి అనుగ్రహంతో డిసెంబర్ 6న తిరుమలలో కుండపోత వర్షం కురిసింది. తిరుమలలో రిజర్వాయర్లు అన్ని నిండాయి. కాషన్ డిపాజిట్ వెనక్కి ఇచ్చే ట్రాకింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చాం' అని తెలిపారు.

రూ.1100 కోట్లు శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నగదు వచ్చింది. 700 ఆలయాలు పూర్తి అయ్యాయి, మిగిలినవి మార్చిలోపు పూర్తి చేస్తాం. చరిత్రలో శ్రీకృష్ణ దేవరాయలు సమయంలో గుళ్లు, గోపురాలు నిర్మాణం చేస్తే.. నేడు సీఎం జగన్ ప్రభుత్వంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 3316 ఆలయాలు నిర్మాణం జరుగుతోంది. నాలుగున్నర ఏళ్లలో టీటీడీ ధార్మిక ఆలయాలు, సదస్సులు శ్రీకృష్ణ దేవరాయలు సమయం కంటే ఎక్కువగా ఆలయాల నిర్మాణం జరిగింది. తిరుపతిలో అచ్యుతం, శ్రీ పథం గెస్ట్ హౌస్‌లు నిర్మాణం చేస్తున్నాం. దీని ద్వారా 25వేల మందికి వసతి సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. సీఎం జగన్ ప్రారంభించిన శ్రీపద్మావతి హార్ట్ కేర్ సెంటర్ ద్వారా 26 నెలల్లో 2350 గుండె ఆపరేషన్స్ విజయవంతంగా నిర్వహించాం. మూడు రోజుల చిన్నారికి గుండె ఆపరేషన్ చేసిన చరిత్ర టీటీడీ శ్రీపద్మావతి చిల్డ్రన్ హార్ట్ కేర్‌దే. 11 గుండె మార్పిడి ఆపరేషన్స్ చేశాం. ప్రపంచంలోనే ఇంత అద్భుతంగా, వేగంగా గుండె ఆపరేషన్స్ జరిగింది లేదు' అని టీటీడీ ఈవో పేర్కొన్నారు.

'సీఎం జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా శ్రీపద్మావతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ శంకుస్థాపన చేశారు. 250 కోట్లతో చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం జరుగుతోంది. 80శాతం పూర్తి అయ్యింది, మరో 20శాతం పనులు పూర్తి కావాల్సి ఉంది. ఎస్వీ వేదిక్ యూనివర్సిటీలో అతీంద్రియ విజ్ఞానం అనే నూతన కోర్సు ప్రారంభించాం. రూ.60కోట్లతో అత్యాధునిక గోశాల నిర్మాణం చేస్తున్నాం. దాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకు వస్తున్నాం. 3518 మంది టీటీడీ ఉద్యోగులకు మొదటి విడతలో ఇళ్ల స్థలాలు, రెండో విడతలో 1700 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశాం. వెంకటగిరి రోడ్డులో 450 ఎకరాల్లో 5వేల మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తాం. ఫిబ్రవరి నెలాఖరుకు అందిస్తాం' అని టీటీడీ ఈవో చెప్పుకొచ్చారు.

# పర్యావరణానికి ప్రాధాన్యం ..ప్లాస్టిక్ రహిత గణతంత్ర దినోత్సవం

మెదక్, జనవరి 26: (నేటినిజం ప్రతినిధి):75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో పర్యావరణానికి ప్రాధాన్యం ఇస్తూ ప్లాస్టిక్ రహిత రిపబ్లిక్ డే ను ఏర్పాటు చేసిన వేడుకలలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత భారత దేశ పౌరులందరిని ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో నడిపించడానికి, స్వాతంత్ర్య పోరాట ఆశయాలను నెరవేర్చడానికి భారత ప్రభుత్వానికి రాజ్యాంగం లేనందున 1935 భారత ప్రభుత్వ చట్టం ఆధారంగా పాలన కొనసాగిందని అన్నారు. కొత్తగా దేశ రాజ్యాంగాన్ని రూపొందించుటకు 1947 ఆగస్టు 28 న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన రాజ్యాంగ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేసి అతి పెద్ద రాజ్యాంగాన్ని లిఖించుకున్నామన్నారు.

1930 లో స్వరాజ్య కోసం ప్రకటన చేసి జనవరి 26 ను పూర్ణ స్వరాజ్య జయంతి దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చి, ఆ తేదీ ప్రాముఖ్యత దృష్ట్యా బ్రిటిష్ కాలం నటి భారత ప్రభుత్వ చట్టం 1935 రద్దు చేస్తూ జనవరి 26, 1950 నుండి నూతన రాజ్యాంగం అమలులోకి తెచ్చుకున్నామన్నారు.

నాటి నుండి భారత దేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించిందని, ప్రజలందరూ సంపూర్ణ స్వేచ్చను, సమానత్వాన్ని, లౌకికత్వాన్ని, న్యాయాన్ని పూర్తి స్థాయిలో హక్కుగా పొందారని గుర్తు చేశారు.

ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని ప్రస్తావిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే తపనతో తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అందులో భాగంగా ఆరు గ్యారంటీల అమలుకు హామీ ఇచ్చి, రెండు గ్యారంటీలను ఇప్పటికే నెరవేర్చిందని అన్నారు.

ప్రజలకు చేరువగా ప్రజాపాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజలవద్దకే పాలన తీసుకువచ్చి ప్రజాసమస్యలు పరిష్కరించడం కొరకు ప్రజాపాలన కార్యక్రమమం ఏర్పాటుచేసి గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల వారీగా తేదీ 28-12-2023 నుండి 06-01-2024 వరకు గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడమైనదని తెలిపారు .

మహాలక్ష్మి పథకం క్రింద జిల్లాలో మెదక్ డిపో రోజుకు 34010 వేల మంది ,నర్సాపూర్ 80129, దాదాపు జిల్లాలో 62500 మంది 9 రూట్లలో 103 బస్సులు లలో ప్రయాణ సౌకర్యం తో మహిళలు ఆర్.టి.సి. బస్సులలో ఉచితంగా ప్రయాణించారన్నారు.

మహాలక్ష్మి ప్రతి నెల ఆర్థిక సహాయం కోసం 187883,వంట గ్యాస్ సబ్సిడీ కి 19,5377 దరఖాస్తు లు స్వీకరించడం జరిగిందన్నారు. రైతు భరోసా పథకం కింద 1'45'777 , వ్యవసాయ కూలీ పథకం కింద 6,579 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది .ఇందిరమ్మ ఇండ్ల కొరకు 1,93,169 ,తెలంగాణ అమర వీరుల,తెలంగాణ ఉద్యమ కారుల కొరకు 405 దరఖాస్తు లు ,గృహ జ్యోతి కొరకు 1,74,016 , చేయూత లో దివ్యంగుల పెన్షన్ కొరకు 4685, ఇతర పెన్షన్లు కొరకు 46,960 దరఖాస్తు లూ ప్రజా పాలన కార్యక్రమం లో 2,25,860 కంప్యూటరికరణ చేయడం జరిగింది. గ్రామాల్లో ,మున్సిపాలిటీలో 50,032 దరఖాస్తు లు స్వీకరించడం జరిగిందన్నారు.

వరిధాన్యం కొనుగోలు మద్దతు ధర ఈ వాన కాలం 2023-24 లో 410 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3,28,718 మెట్రిక్ టన్నుల వరి దాన్యం మద్దతు ధర తో 78,552 రైతుల నుంచి కొనుగోలు చేసి 724 కోట్ల 17 లక్షల రూపాయలు చెల్లించడం జరిగింది. వైద్య ఆరోగ్య శాఖ రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం లో రూపాయలు 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడం జరుగుతున్నది. ఈ పథకం కింద 126 రకాల వ్యాధులకు జీవిత కాలం మందులు ఉచితంగా ఇవ్వబడు తున్నవి. విద్యరంగంలో జిల్లా లో 10 వ తరగతి విద్యార్థులు 2023 -2024 వ విద్య సం: నికి 10,300 మంది,ఇంటర్ లో 13,159 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాబోతున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రత్యేకప్రణాళికలు తయారు చేసి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను సబ్జెక్ట్ ల వారీగా బోధిస్తున్నారు . అదేవిధంగా యువ తకు ఉపాధి, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ప్రజలు కూడా జిల్లా అభివృద్ధిలో భాగస్వాము లు కావాలని కోరారు. ఉత్సాహ భరితంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశభక్తి భావాన్ని నింపుకుని తమ ప్రదర్శనలతో గణతంత్ర దినోత్సవ వేడుకలకు వన్నెలద్దారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు చెందిన బాలబాలికలు చూడచక్కని నృత్య రీతులను అలవోకగా ప్రదర్శిస్తూ ఔరా అనిపించారు. బాలబాలికలు ఏకరూప దుస్తులు ధరించి తమ అభినయంతో అలరింపజేశారు.

ఈ సందర్భంగా చిన్నారులను కలెక్టర్ తో పాటు ఇతర అతిథులు, జిల్లా ఉన్నతాధికారులు వారి వద్దకు వెళ్లి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాపాలన ,ప్లాస్టిక్ నిర్మూలన , రాజీవ్ ఆరోగ్యశ్రీ, పోచారం అభయ అరణ్యంలో పక్షిజాతులు, పట్టాన ,పేదరికనిర్మూలన , వృత్తినైపుణ్యా శిక్షణ , ఓటర్లచైతన్యరథం వంటి పతకాలకు సంబంధించిన శకటాలను ఏర్పాటుచేసినారు అనంతరం శాసన సభ ఎన్నికలు సజావుగా నిర్వహించుటలో చిత్తశుద్ధితో పనిచేసిన అధికారులకు, ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉద్యోగులకు కలెక్టర్ రాజర్షి షా , ఎస్పీ బాల స్వామి, శాసన సభ సభ్యులు డా :మైనం పల్లి రోహిత్ రావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి లక్ష్మీ శారద, అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్,అదనపు ఎస్పీ మహేందర్ , ఆర్ డి. ఓ లు , జిల్లా అధికారులు, ఉద్యోగులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ క్యాంప్ కార్యాలయం లో పతా కావిష్కరణ గావించారు.

# పొత్తుకు ఇబ్బంది కలిగేలా మాట్లాడొద్దు - పవన్ కల్యాణ్

అమరావతి, జనవరి 26: రాబోయే ఎన్నికల్లో ఏపీలో టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనే విషయంలో మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. ఎన్ని సీట్లు తీసుకోవాలో జనసేనాని పవన్ కల్యాణ్ కు కొందరు సలహాలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పవన్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్ని స్థానాలు తీసుకోవాలో తనకు తెలుసని? అది తెలియకుండానే ఇక్కడ వరకు వచ్చానా.. అని ప్రశ్నించారు.

కొందరు 50 తీసుకోండి, 60 తీసుకోండి అంటున్నారని? పొత్తును ఇబ్బంది పెట్టేలా కొందరు మాట్లాడుతున్నారని పవన్ అన్నారు. ఇది మంచిది కాదని హితవు పలికారు. సీట్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. మనం మూడో వంతు సీట్లను తీసుకోబోతున్నామని చెప్పారు. సీట్ల విషయంలో చంద్రబాబుపై ఒత్తిడి ఉంటుందని, అలాగే తనపై కూడా ఒత్తిడి ఉందని అన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో తాను రెండు సీట్లను ప్రకటిస్తున్నానని రాజోలు, రాజానగరంలో జనసేన పోటీ చేస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని అర్థం చేసుకుంటారని భావిస్తున్నానని అన్నారు.

సీఎం పదవి కోసం ఎవరూ ఆందోళన చెందొద్దని పవన్ చెప్పారు. జనసేన ఒంటరిగా పోటీ చేస్తే సీట్లు వస్తాయి కానీ, అధికారంలోకి రాలేమని అన్నారు. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వాన్ని జనసేన ఎంతో ఇరుకున పెట్టిందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలతో టీడీపీతో పొత్తు ముగియ దని, భవిష్యత్తులో కూడా పొత్తు కొనసాగుతుందని తెలిపారు. ఇదే సమయంలో సీఎం జగన్ పై పవన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత చెల్లెలినే వదిలిపెట్టని జగన్? మనల్ని మాత్రం వదులుతాడా? అని ప్రశ్నించారు. జగన్ కు ఊరంతా శత్రువులే అని చెప్పారు. వైసీపీ నేతలకు కష్టాలు వస్తే తన వద్దకే రావాలని అన్నారు.

# బీసీ కమిషన్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



హైదరాబాద్ జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా శుక్రవారం నాడు ఖైరతాబాద్ లోని రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుజాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాలాపన చేసారు.

ఈ కార్యక్రమం లో జెండా వందనం చేస్తున్న రాష్ట్ర సభ్యులు సి హెచ్ ఉపేంద్ర, కిశోర్ గౌడ్, కార్యాలయం అధికారులు నోముల శ్రీనివాసరావు, ప్రసాద్ రావు, సతీష్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# మారు మూల గ్రామాలకు 4జీ సేవలు.. టవర్‌లు ప్రారంభించిన జగన్



అమరావతి, జనవరి 26:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోనూ 4జీ నెట్‌వర్క్ సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. ఏపీ ప్రభుత్వం భాగస్వామ్యంతో దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో పెద్ద సంఖ్యలో 4జీ సెల్ టవర్లను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఇవ్వాల తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్చువల్‌గా 164 సెల్‌టవర్లను సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు.

ఇప్పటికే, మరో టెలికం దిగ్గజం ఎయిర్‌టెల్ ఆధ్వర్యంలో 136 సెల్ టవర్లను రాష్ట్రంలో ఏర్పాటు చేయగా.. జియో ఆధ్వర్యంలో కొత్తగా మరో 164 టవర్లు ఏర్పాటు చేసింది. దాంతో ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా 300 వరకు 4జీ నెట్‌వర్క్ టవర్లను ఏపీ సీఎం ప్రారంభించారు.

## దాదాపు 400 కోట్లు ఖర్చు చేశాం : సీఎం జగన్

4జీ సెల్ టవర్లను ప్రారంభించిన సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా ప్రాంతాల గిరిజనులతో సీఎం జగన్ మాట్లాడారు. ఏపీ రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని టవర్లను జియో విస్తరించనుందని ఆయన అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధమైందని తెలిపారు. దాదాపు 5,549 మారుమూల గ్రామాలకు 4జీ సర్వీసులను అందించాలని ప్రభుత్వం భావిస్తోందని సీఎం జగన్ చెప్పారు. 4జీ సెల్ టవర్ల ఏర్పాటు కోసం దాదాపు 400 కోట్లు ఖర్చు చేశామన్నారు. 400 టవర్ల ఏర్పాటు ద్వారా 2.42 లక్షల మందికి ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. ఇవాళ ఏర్పాటు చేసిన కొత్త టవర్ల ద్వారా మరో 2 లక్షల మందికి ఉపయోగకరంగా ఉంటుందని ఏపీ సీఎం చెప్పారు. మొత్తంగా కలిపి 2887 టవర్లను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం మొత్తంగా రూ. 3,119 కోట్లు ఖర్చు చేస్తున్నావన్నారు. ఇప్పటికే టవర్లకు అవసరమైన భూములను కూడా వెంటనే అప్పగించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ముఖ్య కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, ఐటీ సెక్రటరీ కోన శశిధర్, జియో ఆంధ్రప్రదేశ్ సీఈవో మందపల్లి మహేష్ కుమార్, ఇతర ప్రతినిధులు హాజరయ్యారు. సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, ప్రజలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.




# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు..




ఖమ్మం, జజనవరి 26:(నేటినిజం ప్రతినిధి): 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ నాయకుల ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ లో జాతీయ జెండా ఎగురవేసి గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా సంఘ నాయకులు బుల్లెట్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులు హక్కులతో పాటు విధులు బాధ్యతతో నిర్వహించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగవరపు బాలకృష్ణ, దుర్గా ప్రసాద్, గుంటుపల్లి శ్రీనివాస్ వెంకట్రావు, రామారావు వీణ కుమారి, లలిత కుమారి, సరిత, విజయ్ రాజకుమార్ రాధాకృష్ణ రవిచంద్ర రమేష్ శ్రీనివాస్ జైపాల్ నాగేశ్వరరావు నరేష్ కృష్ణ కోణార్క్ రమేష్ రాజలింగం, నరసయ్య ధారావత్ శ్రీను రామకృష్ణ, గోపయ్య, మౌనిక, రంగారావు బీబు సాహెబ్, నరసింహ రావు అబ్దుల్, నజీర్ బాబా శ్రీనివాస్ రాయలు అనిత, రమణి, సరిత కవిత పాల్గొన్నారు.

# భారతీయ విద్యార్థులు ఫ్రాన్స్‌లో చదువుకునే దిశగా చర్యలు

## – ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కీలక ప్రకటన



న్యూ ఢిల్లీ జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూ న్);ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ శుక్రవారం కీలక ప్రకటన చేశారు. రానున్న రోజుల్లో మరింత ఎక్కువ మంది భారతీయ విద్యార్థులు ఫ్రాన్స్‌లో చదువుకునే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. 2030 నాటికి దాదాపు 30 వేల మంది విద్యార్థులను ఆహ్వానించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తద్వారా ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింతగా బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

తన పర్యటన రెండు దేశాల మధ్య సంబంధాలను మరింతగా బలోపేతం చేస్తుందని మాక్రాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఫ్రెంచ్ ఫర్ ఆల్, ఫ్రెంచ్ ఫర్ ఎ బెటర్ ఫ్యూచర్' చొరవతో విశ్వవిద్యాలయాల్లో ఫ్రెంచ్ నేర్చుకోవడానికి ఒక నెట్‌వర్క్‌ను సృష్టిస్తామని వివరించారు

. ఫ్రెంచ్ మాట్లాడలేని విద్యార్థుల కోసం అంతర్జాతీయ తరగతులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఫ్రాన్స్‌లో చదివిన పూర్వ విద్యార్థులకు వీసా సదుపాయం కల్పిస్తామని ఈ సందర్భంగా మాక్రాన్ వెల్లడించారు. ఇక 2025నాటికి 20 వేల మంది విద్యార్థులను ఫ్రాన్స్‌కి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

# ముగిసిన 'వాటర్ విజన్ ఏ 2047- ముందడుగు ' అనే అంశంపై జరిగిన రెండు రోజుల అఖిల భారత కార్యదర్శుల సదస్సు

న్యూఢిల్లీ, జనవరి 26:దేశంలో జల భద్రతను పటిష్టం చేయడానికి అమలు చేయాల్సిన చర్యలు చర్చించడానికి రెండు రోజుల పాటు చెన్నై (తమిళనాడు) మహాబలిపురంలో 'వాటర్ విజన్ ఏ 2047- ముందడుగు ' అనే అంశంపై జరిగిన అఖిల భారత కార్యదర్శుల సదస్సు నిన్న ముగిసింది. సదస్సులో 32-రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులు , 30 మంది కార్యదర్శులు, 300 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు, 2023 జనవరి 5, 6 తేదీల్లో మధ్యప్రదేశ్ లోని భోపాల్ లో జరిగిన “నీటిపై మొదటి అఖిల భారత వార్షిక రాష్ట్ర మంత్రుల సదస్సు” ఆమోదించిన 22 సిఫార్సులు అమలు చేయడానికి అమలు జరుగుతున్న చర్యలు, అమలు చేస్తున్న విధానాలను సదస్సులో చర్చించారు.

త్రాగునీరు, జల వనరులకు సుస్థిరతకు ప్రాధాన్యత ఇవ్వడం, వాతావరణ స్థితిస్థాపకత పెంపొందించడం, డిమాండ్, సరఫరా , పెద్ద , చిన్న స్థాయిలో నీటి నిల్వను పెంచడం, జలవనరుల నిర్వహణ కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, ప్రతి స్థాయిలో నీటి సంరక్షణ కార్యక్రమాలు అమలు చేయడం, నదుల అనుసంధానాన్ని ప్రోత్సహించడం, నదుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ , తగిన వరద నిర్వహణ చర్యలు చేపట్టడం, ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలు అమలు చేయడం లాంటి అంశాలపై భోపాల్ లో జరిగిన “నీటిపై మొదటి అఖిల భారత వార్షిక రాష్ట్ర మంత్రుల సదస్సు” సిఫార్సులు చేసింది. ఈ సిఫార్సులు కార్యరూపం దాల్చడానికి అమలు చేయాల్సిన చర్యలను మహాబలిపురం సదస్సు చర్చించింది.

సదస్సులో నీటి నిర్వహణ రంగంలో ఐదు అంశాలపై విడివిడిగా సమావేశాలు జరిగాయి. . సదస్సు మొదటి రోజున పర్యావరణ స్థితిస్థాపకత, నదుల పరిరక్షణ అనే అంశంపై చర్చలు జరిగాయి.

కేంద్ర జల శక్తి శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన మంత్రుల స్థాయి సమావేశం జరిగింది. ప్రజలు, పర్యావరణ శ్రేయస్సు కోసం జలవనరులను పరిరక్షించాల్సి ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

ఈ అంశంలో పరస్పర సహకారం, ఆవిష్కరణల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. దేశంలో నీటి భద్రత లక్ష్యాల సాధన కోసం రాష్ట్రాల సహకారంతో కేంద్రం చర్యలు అమలు చేస్తుందని శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు.

సదస్సులో రెండో రోజు 'నీటి వినియోగ సామర్థ్యం', 'నీటి నిల్వ, నిర్వహణ', 'ప్రజల భాగస్వామ్యం అనే అంశాలపై మూడు సమావేశాలు నిర్వహించారు.

సదస్సులో చర్చించిన ముఖ్య అంశాలు, ఆమోదించిన తీర్మానాలను జాతీయ జల మిషన్ ఎండీ శ్రీమతి అర్చనా వర్మ వివరించారు. కింది అంశాలపై ప్రధానంగా చర్చ జరిగిందని ఆమె తెలిపారు.






# పీఎం గతిశక్తి కింద ప్రతిపాదించిన మూడు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రైల్ సాగర్ కారిడార్ ను సమీక్షించిన పీఎం గతి శక్తి 64వ నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ (ఎన్పీజీ) సమావేశం

న్యూఢిల్లీ, జనవరి 26:9600 కోట్ల వ్యయంతో మంత్రిత్వ శాఖలు సిద్ధం చేసిన ప్రతిపాదనలను చర్చించిన నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్

సికింద్రాబాద్ లోని రైల్వేస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ లో సమావేశమైన నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్

పీఎం గతిశక్తి 64వ నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ సమావేశం 2023 జనవరి 23న సికింద్రాబాద్ రైల్వేస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ లో డీపీఐఐటీ ప్రత్యేక కార్యదర్శి (లాజిస్టిక్స్) శ్రీమతి సుమితా దావ్రా అధ్యక్షతన జరిగింది. సమావేశానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న రోడ్డు రవాణా ,రహదారుల మంత్రిత్వ శాఖ, రైల్వే మంత్రిత్వ శాఖ, ఓడరేవులు, జలమార్గాలు మంత్రిత్వ శాఖ, టెలికమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ,ఇంధన మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ , నీతి ఆయోగ్, దక్షిణ మధ్య రైల్వే కు చెందిన సీనియర్ అధికారులు హాజరయ్యారు.

సమావేశంలో రోడ్డు రవాణా ,రహదారుల మంత్రిత్వ శాఖ (2), రైల్వే శాఖ(1) 9,600 కోట్ల రూపాయల ఖర్చుతో ప్రతిపాదించిన మూడు గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులను సమీక్షించారు. సమావేశంలో సమీక్షించిన ప్రాజెక్టుల వివరాలు :

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రతిపాదిత కొత్త బీజీ లైన్ వాణిజ్య, పర్యాటక ప్రాంతాలను ఏకీకృతం చేయడానికి తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య బ్రాడ్-గేజ్ లైన్‌ను నిర్మించాలని రైల్వే మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్ట్ మల్టీ మోడల్ రవాణా సౌకర్యాలు మెరుగుపరచడం, సరకు రవాణా , ప్యాసింజర్ రైళ్ల సామర్థ్యాన్ని పెంచడం తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ మధ్య వేగవంతమైన రైలు సౌకర్యం అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. అదనంగా ప్రాజెక్ట్ ఉపాధి అవకాశాలు కల్పించి, పర్యాటక రంగం అభివృద్ధికి దోహదపడుతుంది. ప్రధాన జంక్షన్‌లలో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తుంది.అన్ని ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించడం కోసం ప్రాంతీయ అభివృద్ధి విధానంలో సమగ్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలని రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లోని రేవులకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తారు.

భారత్ మాల పరియోజన కింద కొత్త రీజియన్ రింగ్ రోడ్డు నిర్మాణం

ఒడిశా లో నిర్మించి తలపెట్టిన న్యూ రీజియన్ రింగ్ రోడ్ (ఆంఆర్ఆర్ ) ప్రతిపాదిత నిర్మాణాన్ని నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ సభ్యులు విశ్లేషించారు. చెన్నై- కోల్‌కతా మధ్య సరుకు రవాణాను సులభతరం చేయడానికి ప్రాజెక్టును నిర్మించాలని రహదారులు,రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఆర్థిక కారిడార్లు, ఇండస్ట్రియల్ పార్కులు, మినరల్ , మైనింగ్ జోన్‌లు, గూడ్స్ షెడ్‌లు మొదలైన వాటితో పాటు రవాణా, ప్రజల అవసరాలు ప్రాజెక్టు వల్ల తీరుతాయి. ఇది ఒడిశాలోని ప్రధాన పట్టణాల మీదుగా సాగుతున్న వాహనాల రాకపోకలను తగ్గిస్తుంది. నగరాల్లో ట్రాఫిక్ రద్దీ నివారిస్తుంది . ప్రయాణ సమయాన్ని 37.5% తగ్గించడం ద్వారా రవాణా సామర్థ్యాన్ని పెంచుతుంది.

ఉత్తరప్రదేశ్‌లో జాతీయ రహదారి -727 ని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించడానికి ప్రతిపాదించిన మరో ముఖ్యమైన ప్రాజెక్ట్ సమావేశంలో చర్చకు వచ్చింది. పూర్తయిన తర్వాత ఈ ప్రాజెక్ట్ బౌద్ధ సర్క్యూట్ రూట్, 2 సోషల్ , 3 ఇండస్ట్రియల్ పార్కులు, ఫిషింగ్ సీఫుడ్, టెక్స్‌టైల్ క్లస్టర్‌లు, అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌లు, ఎయిర్‌పోర్ట్‌లతో సహా పదకొండు రవాణా సేవలకు మెరుగైన రవాణా సౌకర్యం అందిస్తుంది.

ప్రాజెక్టు వల్ల సరిహద్దుల మధ్య వాణిజ్య కార్యకలా పాలు పెరుగుతాయని, సామాజిక- ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని , ఆర్థిక కేంద్రాలు, పారిశ్రామిక మండలాలు, వ్యవసాయ ప్రాంతాలు, పారిశ్రామిక పార్కులు మొదలైన వాటికి రహదారి సౌకర్యం మెరుగ ఎపడుతుందని భావిస్తున్నారు. దీనివల్ల ఆర్థిక కార్యకలాపాలు, వాణిజ్యం, పెట్టుబడులు అభివృద్ధి చెందుతాయని అంచనా. గిడ్డంగులు , పంపిణీ కేంద్రాలు, లాజిస్టిక్స్ హబ్‌లతో సహా అనుబంధ రంగాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పించి , పెరుగుతున్న ట్రాఫిక్ మరియు ప్రయాణ డిమాండ్‌ను తీర్చడానికి సౌకర్యాలు, గ్యాస్ స్టేషన్‌లు మరియు విశ్రాంతి ప్రాంతాల వంటి కొత్త సేవలు అందించడానికి ప్రాజెక్టు ద్వారా కార్యక్రమాలు అమలు జరుగుతాయి.

# పంతొమ్మిది వేల ఒక వంద కోట్ల రూపాయల కు పైచిలుకు విలువ కలిగిన అభివృద్ధి పథకాల శంకుస్థాపన

న్యూఢిల్లీ, జనవరి 26:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 19,100 కోట్ల రూపాయల పైచిలుకు విలువ కలిగిన అభివృద్ధి పథకాల ను ఉత్తర్ ప్రదేశ్ లోని బులంద్‌శహర్ లో ఈ రోజు న ప్రారంభించడం తో పాటు శంకుస్థాపనలను కూడా చేశారు. ఆయా ప్రాజెక్టు లు రేల్ వే, రహదారులు, చమురు, ఇంకా గ్యాస్, పట్టణాభివృద్ధి మరియు గృహ నిర్మాణం ల వంటి అనేక ముఖ్య రంగాల కు సంబంధించినవి.

ప్రధాన మంత్రి జనసమూహాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, బులంద్‌శహర్ యొక్క ప్రజలు, ప్రత్యేకించి పెద్ద సంఖ్యల లో తరలి వచ్చిన మాతృమూర్తులు మరియు సోదరీమణులు చాటిన వాత్సల్యానికి, విశ్వాసానికి గాను కృతజ్ఞత ను వ్యక్తం చేశారు. జనవరి 22 వ తేదీ నాడు ప్రభువు శ్రీ రాముని దర్శనం కలగడం, మరి ఈ రోజు న ఉత్తర్ ప్రదేశ్ యొక్క ప్రజలు ఈ కార్యక్రమాని కి తరలి రావడం తనకు దక్కిన సౌభాగ్యం అంటూ శ్రీ నరేంద్ర మోదీ ధన్యవాదాల ను తెలియజేశారు. రేల్ వే, హైవే, పెట్రోలియమ్ పైప్ లైన్, నీరు, మురుగు నీరు, వైద్య కళాశాల మరియు ఇండస్ట్రియల్ టౌన్‌శిప్ ల వంటి రంగాల లో 19,000 కోట్ల రూపాయల కు పైగా విలువ కలిగిన అభివృద్ధి పథకాల కు గాను బులంద్‌శహర్ ప్రజల తో పాటు యావత్తు పశ్చిమ ఉత్తర్ ప్రదేశ్ ప్రజల కు ఆయన అభినందనల ను తెలియజేశారు. యమున నది మరియు రామ్ గంగ నది ల లో స్వచ్ఛత ప్రచార ఉద్యమాల కు సంబంధించిన ప్రాజెక్టుల ప్రారంభాన్ని గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

అటు రామ్ కాజ్ కు, ఇటు రాష్ట్ర కాజ్ కు (రామ కార్యానికి మరియు దేశం యొక్క కార్యాలకు) జీవనాన్ని సమర్పణం చేసినటువంటి శ్రీ కల్యాణ్ సింహ్ వంటి ఒక పుత్రుడి ని దేశ ప్రజల కు ఈ ప్రాంతం అందించింది అని ప్రధాన మంత్రి అన్నారు. శ్రీ కల్యాణ్ సింహ్ కన్న కల ను దేశం నెరవేర్చింది అని ప్రధాన మంత్రి చెప్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. “ఒక బలమైన దేశాన్ని మరియు సిసలైన సామాజిక న్యాయాన్ని సాధించాలి అని శ్రీ కల్యాణ్ సింహ్ కన్న కలను పండించడం కోసం మనం మరింత జోరు ను అందుకోవలసి ఉంది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

అయోధ్య లో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం పూర్తి అయిన సంగతి ని ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రతిష్ఠ కు పెద్దపీట ను వేయాలి, మరి దేశాన్ని క్రొత్త శిఖరాల కు చేర్చాలి అని స్పష్టం చేశారు. “దేవ్ నుండి దేశం, మరి అలాగే రాముని నుండి దేశం” అనే మార్గానికి ధైర్యాన్ని మనం సంతరించి తీరాలి అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. 2047 వ సంవత్సరాని కల్లా భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశం గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని శ్రీ నరేంద్ర మోదీ నొక్కి పలికారు. ఉన్నత లక్ష్యాల ను సాధించడం గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, సబ్ కా ప్రయాస్ తాలూకు ఉత్సాహం తో పాటు అవసరమైన అన్ని వనరుల ను పోగేసుకోవాలి అని ఉద్ఘాటించారు. “వికసిత్ భారత్ ను ఆవిష్కరించాలి అంటే శరవేగంతో కూడినటువంటి ఉత్తర్ ప్రదేశ్ అభివృద్ధి తప్పనిసరి” అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ క్రమం లో వ్యవసాయం, విజ్ఞాన శాస్త్రం, విద్య, పరిశ్రమ మరియు వాణిజ్య సంస్థలు తదితర రంగాల లో పునరుత్తేజం రచవలసిన అవసరం ఉంది అని ఆయన అన్నారు. “ఈ నాటి సందర్భం ఈ దిశ లో ఒక పెద్ద అడుగు” అంటూ ఆయన అభివర్ణించారు.

భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించుకొన్న తరువాతి కాలం లో అభివృద్ధి పరం గా ప్రాంతీయ అసమానతల ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, అతి ఎక్కువ జనాభా కలిగిన ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం చిన్నచూపునకు గురి అయింది అన్నారు. 'పాలక' మనస్తత్వాన్ని ప్రధాన మంత్రి విమర్శించారు; ఇదివరకటి కాలాల్లో అధికారం కోసం సామాజిక విభజనల ను ఎగదోయడం తో రాష్ట్రం మరియు దేశం భారీ మూల్యాల ను చెల్లించుకోవలసి వచ్చింది అని ఆయన అన్నారు. “దేశం లో అతి పెద్దది అయినటువంటి రాష్ట్రం బలహీనం గా ఉన్నప్పుడు, దేశం ఏ విధం గా బలోపేతం అవుతుంది?” అంటూ ప్రధాన మంత్రి ప్రశ్నించారు.

ఉత్తర్ ప్రదేశ్ లో 2017 వ సంవత్సరం లో డబల్ ఎన్ జిన్ ప్రభుత్వం ఏర్పాటు కావడం తో, రాష్ట్రం పాత సవాళ్ళ ను ఎదుర్కోవడం లో క్రొత్త దారుల ను కనుగొంది; ఆర్థిక అభివృద్ధి కి అండ ను అందించింది; మరి ఈ రోజు న ఈ సందర్భం ప్రభుత్వం యొక్క నిబద్ధత కు ఒక రుజువు గా ఉంది అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. పశ్చిమ ఉత్తర్ ప్రదేశ్ లో ఇటీవలి ఘటన క్రమాల ను గురించి న ఉదాహరణల ను ప్రధాన మంత్రి ఇస్తూ, భారతదేశం లో రెండు డిఫెన్స్ కారిడర్ లను అభివృద్ధి చేయడం గురించి; అలాగే, అనేక నూతన జాతీయ రాజమార్గాల ను ఏర్పాటు చేయడం గురించి వివరించారు. ఆధునిక ఎక్స్ ప్రెస్ వేస్, ఒకటో నమో భారత్ ట్రైన్ ప్రాజెక్టు ను మొదలు పెట్టడం, అనేక నగరాల లో మెట్రో కనెక్టివిటీ ల ద్వారా ఉత్తర్ ప్రదేశ్ లో అన్ని ప్రాంతాల కు కనెక్టివిటీ ని పెంచడానికి ప్రభుత్వం శ్రద్ధ ను తీసుకొంది. మరి రాష్ట్రం ఈస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడర్ కు మరియు వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడర్ కు ఒక కేంద్రం గా రూపుదిద్దుకొంటోంది అని ఆయన అన్నారు. “ఈ అభివృద్ధి ప్రాజెక్టు లు రాబోయే శతాబ్దాల లో వాటి ప్రభావాన్ని ప్రసరింప చేస్తాయి” అని ఆయన స్పష్టం చేశారు. జేవర్ విమానాశ్రయం పూర్తి కావడం తో, ఈ ప్రాంతం ఒక క్రొత్త బలాన్ని మరియు ఉన్నతి ని అందుకోగలుగుతుంది అని కూడా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

“ప్రభుత్వ కృషితో దేశంలోని ప్రధాన ఉద్యోగ ప్రదాత ప్రాంతాల్లో ఒకటిగా నేడు పశ్చిమ ఉత్తరప్రదేశ్ అవతరిస్తోంది” అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రభుత్వం నాలుగు ప్రపంచ స్థాయి ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలపై కసరత్తు చేస్తోందని ప్రధాన మంత్రి తెలిపారు. వీటిలో ఒకటి పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఉంది, ఈ ముఖ్యమైన టౌన్‌షిప్‌ను ప్రధాన మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఇది పరిశ్రమలకు, ఈ ప్రాంతంలోని చిన్న, కుటీర వ్యాపారాలకు ప్రయోజనం చేకూరుస్తుంది. టౌన్‌షిప్ వ్యవసాయ ఆధారిత పరిశ్రమకు కొత్త మార్గాలను సృష్టిస్తుందని, స్థానిక రైతులు, కార్మికులకు అపారమైన ప్రయోజనాలను అందిస్తుందని ప్రధాని మోదీ అన్నారు.

వ్యవసాయంపై పూర్వ కాలంలో కనెక్టివిటీ లేకపోవడం వల్ల కలిగే ప్రతికూల ప్రభావం గురించి ప్రస్తావించిన ప్రధాన మంత్రి, కొత్త విమానాశ్రయం, కొత్త ప్రత్యేక సరుకు రవాణా కారిడార్‌లో పరిష్కారాన్ని చూడవచ్చని అన్నారు. చెరకు ధరలను పెంచడంతోపాటు మండిలో ఉత్పత్తులను విక్రయించిన తర్వాత నేరుగా రైతుల ఖాతాలకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చూడడం కోసం డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ప్రధాని అభినందించారు. అదేవిధంగా, చెరకు రైతులకు ఇథనాల్‌పై దృష్టి పెట్టడం లాభదాయకంగా మారిందని అన్నారు.

”రైతు సంక్షేమమే ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత” అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. రైతులకు రక్షణ కవచం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, భారత రైతులకు తక్కువ ధరకే ఎరువులు అందుబాటులో ఉంచేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. భారతదేశం వెలుపల రూ. 3,000 ఖరీదు చేసే యూరియా బ్యాగ్‌ను రూ. 300 కంటే తక్కువ ధరకే రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన తెలియజేశారు. చిన్న బాటిల్‌తో ఎరువుల బస్తాకు సరిపడే నానో యూరియాను రూపొందించడంపై దృష్టి సారించామని, తద్వారా వినియోగం తగ్గుతుందని, డబ్బు ఆదా అవుతుందని ఆయన వెల్లడించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం రూ. 2.75 లక్షల కోట్లు బదిలీ చేసిందని శ్రీ మోదీ తెలియజేశారు.

వ్యవసాయం, వ్యవసాయ-ఆర్థిక వ్యవస్థలో రైతుల సహకారాన్ని నొక్కిచెప్పిన ప్రధాన మంత్రి, సహకార సంఘాల పరిధి నిరంతర విస్తరణను వివరించారు. చిన్న రైతుల బలోపేతానికి చర్యలుగా పిఏసిలు, సహకార సంఘాలు, ఎఫ్‌పిఓలను ఆయన ప్రస్తావించారు. సహకార సంస్థలు అమ్మకం కొనుగోలు, రుణాలు, ఫుడ్ ప్రాసెసింగ్ లేదా ఎగుమతులకు ప్రోత్సహిస్తున్నామని అన్నారు. మొత్తం దేశంలో కోల్డ్ స్టోరేజీల నెట్‌వర్క్‌ను సృష్టించే ప్రపంచంలోనే అతిపెద్ద నిల్వ సంబంధిత పథకాలను కూడా శ్రీ మోదీ ప్రస్తావించారు. వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. నారీ శక్తి దీనికి ఒక భారీ మాధ్యమంగా మారగలదని నొక్కిచెప్పారు. మహిళా స్వయం సహాయక బృందాలకు డ్రోన్ పైలట్లు కావడానికి శిక్షణ ఇస్తున్న నమో డ్రోన్ దీదీ పథకాన్ని ఆయన ప్రస్తావించారు. “నమో డ్రోన్ దీదీ భవిష్యత్తులో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయానికి బలీయమైన శక్తిగా మారబోతోంది” అని ఆయన అన్నారు.

గడచిన 10 ఏళ్లలో చిన్న రైతులు, మహిళలను సాధికారత కలిపించ దానికి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావించారు. కోట్లాది పక్కా ఇళ్లు, మరుగుదొడ్లు, కుళాయి నీటి కనెక్షన్లు, రైతులు, కూలీలకు పెన్షన్ సౌకర్యాలు, పంటలు నష్టపోతే రైతులకు రూ. 1.5 లక్షల కోట్లకు పైగా అందజేసే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ఉచిత రేషన్ పథకం, ఆయుష్మాన్ భారత్ పథకం తదితర అంశాలను ప్రధాని వివరించారు. “ప్రభుత్వ పథకానికి ఏ లబ్ధిదారుడు దూరం కాకూడదనేది ప్రభుత్వ ప్రయత్నం, దీని కోసం మోడీ కి గ్యారెంటీ వాహనాలు ప్రతి గ్రామానికి చేరుతున్నాయి, ఉత్తరప్రదేశ్‌లో కూడా లక్షలాది మందిని పథకాలలో రిజిస్టర్ అయ్యేలా చేసాము” అని శ్రీ మోదీ తెలిపారు.

“ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రతి పౌరుడికి అందుతుందన్నది మోదీ హామీ. ఈ రోజు దేశం ఏదైనా హామీని నెరవేర్చే హామీగా మోడీ హామీని పరిగణిస్తోంది” అని ప్రధాన మంత్రి అన్నారు. “ప్రభుత్వ పథకం ప్రయోజనాలు ప్రతి లబ్దిదారునికి చేరేలా ఈరోజు మేము అన్ని ప్రయత్నాలు చేస్తున్నాము. అందుకే మోడీ గ్యారెంటీ ఇస్తున్నారు. 100 శాతం లబ్ధిదారులను చేరవేయాలని మోదీ ఉద్ఘాటిస్తున్నారు” అని ప్రధాన మంత్రి అన్నారు. ఇది వివక్ష లేదా అవినీతికి సంబంధించిన ఏదైనా అవకాశాన్ని తొలగిస్తుంది. ‘‘ఇది నిజమైన లౌకికవాదం, సామాజిక న్యాయం’’ అన్నారాయన. ప్రతి సమాజంలోనూ రైతులు, మహిళలు, పేదలు, యువత కలలు ఒకేలా ఉంటాయన్నారు. ప్రభుత్వ కృషి వల్ల గత 10 ఏళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని అన్నారు.

ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగిస్తూ, ‘‘నాకు మీరు నా కుటుంబం. మీ కల నా తీర్మానం. ’’ అని స్పష్టం చేశారు. దేశంలోని సామాన్య కుటుంబాల సాధికారత సాధించడమే మోదీ సంపద అని ఆయన నొక్కి చెప్పారు. గ్రామాలు, పేదలు, యువత, మహిళలు, రైతులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ సాధికారత కల్పించాలనే ప్రచారం కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు.

ఉత్తరప్రదేశ్ గవర్నర్, శ్రీమతి ఆనందిబెన్ పటేల్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ బ్రజేష్ పాఠక్, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల రాష్ట్ర మంత్రి, జనరల్ (రిటైర్డ్) వీకే సింగ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డి ఎఫ్ సి)లో న్యూ ఖుర్జా - న్యూ రేవారీ మధ్య 173 కి.మీ పొడవైన డబుల్ లైన్ విద్యుద్దీకరణ విభాగాన్ని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా రెండు స్టేషన్ల నుండి గూడ్స్ రైళ్లను ఫ్లాగ్ చేయడం ద్వారా ప్రధాని జాతికి అంకితం చేశారు. ఈ కొత్త డి ఎఫ్ సి విభాగం ముఖ్యమైనది, ఎందుకంటే ఇది పశ్చిమ, తూర్పు డి ఎఫ్ సి ల మధ్య కీలకమైన కనెక్టివిటీని ఏర్పాటు చేస్తుంది. ఇంకా, ఈ విభాగం ఇంజనీరింగ్ అద్భుతమైన ప్రయత్నానికి ప్రసిద్ధి చెందింది. ఇది 'హై రైజ్ ఎలక్ట్రిఫికేషన్‌తో ఒక కిలోమీటరు పొడవైన డబుల్ లైన్ రైలు సొరంగం' కలిగి ఉంది, ఇది ప్రపంచంలోనే మొదటిది. ఈ సొరంగం డబుల్-స్టాక్ కంటైనర్ రైళ్లను సజావుగా నడపడానికి రూపొందించబడింది. డి ఎఫ్ సి ట్రాక్‌పై గూడ్స్ రైళ్లను మార్చడం వల్ల ప్యాసింజర్ రైళ్ల నిర్వహణను మెరుగుపరచడంలో ఈ కొత్త డి ఎఫ్ సి విభాగం సహాయపడుతుంది.

మథుర - పల్వాల్ సెక్షన్ ఉచిపియానా బుజుర్గ్ - దాద్రీ సెక్షన్‌లను కలిపే నాల్గవ లైన్‌ను కూడా ప్రధాన మంత్రి జాతికి అంకితం చేశారు. ఈ కొత్త లైన్లు జాతీయ రాజధాని దక్షిణ పశ్చిమ, తూర్పు భారతదేశానికి రైలు కనెక్టివిటీని మెరుగుపరుస్తాయి.

అనేక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాన మంత్రి జాతికి అంకితం చేశారు. ప్రాజెక్టులలో అలీగఢ్ నుండి భద్వాన్ నాలుగు-లేనింగ్ వర్క్ ప్యాకేజీ-1 (ఎన్హెచ్-34లోని అలీఘర్-కాన్పూర్ విభాగంలో భాగం); షామ్లీ (ఎన్హెచ్-709ఏ) మీదుగా మీరట్ నుండి కర్నాల్ సరిహద్దు వరకు విస్తరించడం; మరియు ఎన్హెచ్-709 ఏడి ప్యాకేజీ-ఎ ఎలోని షామ్లీ-ముజఫర్‌నగర్ సెక్షన్ నాలుగు లేనింగ్. రోడ్డు ప్రాజెక్టులు. రూ. 5000 కోట్ల కంటే ఎక్కువ వ్యయంతో అభివృద్ధి చేయబడిన ఈ రహదారి ప్రాజెక్టులు కనెక్టివిటీని మెరుగుపరుస్తాయి, ఈ ప్రాంతంలో ఆర్థికాభివృద్ధికి సహాయపడతాయి.

ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి ఇండియన్ ఆయిల్ కి సంబంధించిన తుండ్లా-గవారియా పైప్‌లైన్‌ను కూడా ప్రారంభించారు. సుమారు రూ.700 కోట్లతో నిర్మించిన ఈ 255 కి.మీ పొడవునా పైప్‌లైన్ ప్రాజెక్టు నిర్ణీత సమయం కంటే చాలా ముందుగానే పూర్తయింది. మథుర, తుండ్ల వద్ద పంపింగ్ సౌకర్యాలతో, తుండ్లా, లక్నో కాన్పూర్‌లలో డెలివరీ సౌకర్యాలతో బరౌనీ-కాన్పూర్ పైప్‌లైన్‌లోని గవారియా టి-పాయింట్‌కు తుండ్ల నుండి పెట్రోలియం ఉత్పత్తుల రవాణాకు ఈ ప్రాజెక్ట్ సహాయం చేస్తుంది.

'గ్రేటర్ నోయిడాలోని ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్' (ఐఐటీజీఎన్)ని కూడా ప్రధాన మంత్రి జాతికి అంకితం చేశారు. ఇది పీఎం-గతిశక్తి కింద మౌలిక సదుపాయాల కనెక్టివిటీ ప్రాజెక్టుల సమగ్ర ప్రణాళిక, సమన్వయ అమలు ప్రధాన మంత్రి దృష్టికి అనుగుణంగా అభివృద్ధి చేయబడింది. 1,714 కోట్ల వ్యయంతో నిర్మించారు. ప్రాజెక్ట్ 747 ఎకరాలలో విస్తరించి ఉంది. తూర్పు, పశ్చిమ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌ల కూడలికి సమీపంలో తూర్పు పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్ వే దక్షిణాన, తూర్పున ఢిల్లీ-హౌరా బ్రాడ్ గేజ్ రైల్వే లైన్‌తో ఉంది. ఐఐటీజీఎన్ వ్యూహాత్మక స్థానం అసమానమైన కనెక్టివిటీని నిర్ధారిస్తుంది, ఎందుకంటే మల్టీ-మోడల్ కనెక్టివిటీ కోసం ఇతర మౌలిక సదుపాయాలు ఈ ప్రాజెక్ట్ సమీపంలో ఉన్నాయి. నోయిడా -గ్రేటర్ నోయిడా ఎక్స్‌ప్రెస్‌వే (5 కిమీ), యమునా ఎక్స్‌ప్రెస్‌వే (10 కిమీ), ఢిల్లీ విమానాశ్రయం (60 కిమీ), జేవర్ విమానాశ్రయం (40 కిమీ), అజైబ్‌పూర్ రైల్వే స్టేషన్ (0.5 కిమీ) మరియు న్యూ దాద్రి డిఎఫ్సిసి స్టేషన్ (10 కిమీ) దూరంలో ఉన్నాయి. ఈ ప్రాంతంలో పారిశ్రామిక వృద్ధి, ఆర్థిక శ్రేయస్సు, స్థిరమైన అభివృద్ధిని పెంపొందించే దిశగా ప్రాజెక్ట్ ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది. ఈ కార్యక్రమంలో, దాదాపు రూ.460 కోట్లతో మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్‌టిపి) నిర్మాణంతో సహా పునరుద్ధరించబడిన మథుర మురుగునీటి పారుదల పథకాన్ని ప్రధాని ప్రారంభించారు. ఈ పనిలో మసాని వద్ద 30 ఎంఎల్డి ఎస్టిపి నిర్మాణం, ట్రాన్స్ యమునా వద్ద ఇప్పటికే ఉన్న 30 ఎంఎల్డి పునరావాసం, మసాని వద్ద 6.8 ఎంఎల్డి ఎస్టిపి, 20 ఎంఎల్డి ప్లాంట్ (రివర్స్ ఆస్మాసిస్ ప్లాంట్) నిర్మాణం ఉన్నాయి.

# రిపబ్లిక్ డే వేడుకల్లో అపశృతి.. విద్యుత్ షాక్ తో ఇద్దరు మృతి



ములుగు, జనవరి 26 : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. పతాకావిష్కరణ చేస్తుండగా జెండా పైపునకు విద్యుత్ వైర్లు తగిలి ముగ్గురు యువకులు విద్యుత్ షాక్ కు గురయ్యారు. వారిలో ఇద్దరు మృతిచెందగా, మరొకరు మృత్యువుతో పోరాడుతున్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి సీతక్క సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఈ విషాద సంఘటన ములుగు జిల్లా కేంద్రంలోని దళితవాడలో జరిగింది. స్థానిక యువకులకు జెండా ఆవిష్కరణ కోసం ఐరన్ పైప్ తో జెండా కడుతున్నారు. ఈ క్రమంలో ఇనుప పైప్ నకు విద్యుత్ వైర్లు తగిలాయి. జెండాకు విద్యుత్ వైర్లు తాకడంతో విజయ్, చక్రి, అజిత్ అనే ముగ్గురు విద్యుత్ షాక్ కు గురయ్యారు. ఈ క్రమంలో వారిని వెంటనే ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కానీ ఫలితం దక్కలేదు.

చికిత్స పొందుతూ అజిత్, విజయ్ అనే ఇద్దరూ మృతిచెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలిసిన వెంటనే ఆస్పత్రికి చేరుకున్న మంత్రి సీతక్క తీవ్రభ్రాంతికి లోనయ్యారు.. మృతుల కుటుంబాలను పరామర్శించిన సీతక్క గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించాలని సూచించారు.

# త్వరలోనే నేనూ ప్రజల్లోకి వస్తా.. : కేసీఆర్



హైదరాబాద్, జనవరి 26:త్వరలోనే ప్రజల్లోకి వస్తానని భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రకటించారు. కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ నెల 31 నుంచి పార్లమెంట్ సమావేశాలు జరుగనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి ఒకటిన కేంద్రం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నది. ఈ సందర్భంగా కేసీఆర్ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. భేటీకి రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలతో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు.

సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆశలు బీఆర్ఎస్ ఎంపీలపైనే ఉందన్నారు. అధికారంలో లేకపోయినా రాష్ట్రం కోసం పని చేసేది బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ గళం బలంగా వినిపించాలని సూచించారు. రాష్ట్ర హక్కులు, ప్రయోజనాల కోసం పోరాడాలన్నారు. విభజనచట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన వాటిపై ప్రశ్నించాలన్నారు. కృష్ణాబోర్డుకు ప్రాజెక్టులు అప్పగిస్తే తెలంగాణకు నష్టం జరుగుతుందన్నారు. ఆపరేషన్ మ్యానువల్, ప్రోట్రోకాల్ లేకుండా ప్రాజెక్టులు ఎలా తీసుకుంటారన్నారు.

బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో బలంగా ఉందని, ఎవరితోనూ సంబంధం లేకుండా గట్టిగా పోరాడుదాం అని పిలుపునిచ్చారు. త్వరలోనే తాను సైతం ప్రజల్లోకి వస్తానని చెప్పారు. సమావేశం అనంతరం రాజ్యసభలో బీఆర్ఎస్ నేత కే కేశవరావు మాట్లాడుతూ.. విభజనచట్టంలోని హామీలపై పార్లమెంట్‌లో మాట్లాడుతామన్నారు. కృష్ణాబోర్డు ప్రాజెక్టుల అప్పగింత అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతామన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామన్నారు. తెలంగాణ గళం, బలం, దళం బీఆర్ఎస్సేనని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం కోసం ఏం చేయాలో కేసీఆర్ దిశానిర్దేశం చేశారన్నారు.

# మెట్రో రెండో దశ విస్తరణపై ఎండీ ఎన్వీఎస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు..!

హైదరాబాద్, జనవరి 26: హైదరాబాద్ మెట్రో రెండో దశలపై సంస్థ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మెట్రో రైలు భవన్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బందికి హైదరాబాద్‌లో మెట్రోరైలు ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెటో రెండో దశ విస్తరణ ప్రతిపాదనలకు సీఎం రేవంత్ ఆమోదం తెలిపారని చెప్పారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ విమానాశ్రయాన్ని కలుపుతూ 70 కిలోమీటర్ల మేర రెండో దశలో మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

ట్రాఫిక్ సర్వేలు, డీపీఆర్‌ల తయారీ శరవేగంగా జరుగుతుందన్నారు. ఫేజ్–2 లో చేపట్టబోయే మెట్రో సేవలు రాజధానిలోని అన్ని వర్గాలకు అందుతాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆకర్షణీయమవుతాయన్నారు. హెచ్ఎంఆర్ఎల్ ఇంజినీర్లు, ఉద్యోగులు తమను తాము పునరంకితం చేసుకోవాలని, వినూత్న మార్గంలో కొత్త శక్తితో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం ఆదేశాల మేరకు ఇటీవల ఫేజ్–2 రూట్‌మ్యాప్, 70 కిలోమీటర్ల కొత్త మెట్రో రైలు మార్గాన్ని నిర్మించేలా మెట్రో అధికారులు ప్రతిపాదనలు తయారు చేసిన పంపిన విషయం తెలిసిందే.

హైదరాబాద్ మెట్రో కారిడాం–2లో భాగంగా ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్లు. ఫలక్‌నుమా నుంచి చాంద్రయాణగుట్ట క్రాస్ రోడ్డు వరకు 1.5 కిలోమీటర్లు కొత్తగా మెట్రో లైన్‌కు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ మెట్రో కారిడార్–4లో నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 29 కిలోమీటర్లు విస్తరించాలని, నాగోల్ నుంచి ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ మీదుగా చాంద్రయాణగుట్ట క్రాస్ రోడ్డు, మైలార్‌దేవ్‌పల్లి మెట్రో నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు ప్రతిపాదించారు.

# మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్‌లో ఘనంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**–జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్**



కరీంనగర్, జనవరి 26:(నేటినిజం ప్రతినిధి) నగరంలోని 18వ డివిజన్ పరిధిలోని షేక్ ఖాన్ నగర్ రేకుర్తి లోని మదర్స అరబియా హిఫ్జుల్ ఖురాన్ లో 75 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మదర్సా ప్రిన్సిపాల్ ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల స్ఫూర్తి ఫలితంగా స్వాతంత్రం సిద్ధించిందని భారత దేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగం ఇచ్చినటువంటి స్వేచ్ఛ వాయువుల ఫలితమే గణతంత్ర దినోత్సవం అని అన్నారు. మదర్సా విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని చేసినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ క్రీడల్లో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హాఫిజ్ అబ్దుల్ రజాఖ్, టీచర్లు హాఫిజ్ అహ్మద్ హిష్జి, హాఫిజ్ ఫరీద్, హాఫిజ్ ఫజల్, ఖారి సాజిద్, మదర్సా విద్యార్థులు పాల్గొన్నారు.

# కరీంనగర్ నుండే బీజేపీ పార్లమెంట్ ఎన్నికల శంఖారావం.. బండి సంజయ్



కరీంనగర్, జనవరి 26:పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని కరీంనగర్ నుండే పూరించబోతున్నామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ చెప్పారు. అందులో భాగంగా ఈనెల 28న కరీంనగర్ లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో 10 నుండి 20 వేల మంది బీజేపీ కార్యకర్తలతో పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల సమ్మేళనం నిర్వహించబోతున్నామన్నారు. ఈరోజు సాయంత్రం ఎస్సారార్ కళాశాలకు విచ్చేసిన బండి సంజయ్ ఎల్లుండి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల సమ్మేళనానికి సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పనులను పరిశీలించారు. కేంద్ర హోంమంత్రి రాకను పురస్కరించుకుని పార్టీ నాయకులతోపాటు జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగంతోనూ చర్చించారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎల్లుండి తెలంగాణకు వస్తున్నారు. మూడు క్లస్టర్ మీటింగుల్లో పాల్గొంటారు. ఎలక్షన్ మేనేజ్ మెంట్ మీటింగ్ లో పాల్గొంటారు. వీటితోపాటు చారిత్రక కట్టడాలను సందర్శిస్తారన్నారు. అందులో భాగంగా ఈనెల 28న ఉదయం పాలమూరులో క్లస్టర్ మీటింగ్ లో అమిత్ షా పాల్గొంటారన్నారు. ఆ తరువాత మధ్యాహ్నం ఒంటి గంటకు కరీంనగర్ చేరుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల సమ్మేళనంలో పాల్గొంటారన్నారు. 10 వేల నుండి 20 వేల మంది కార్యకర్తలు ఈ సమ్మేళనంలో పాల్గొంటారు. పార్లమెంట్ ఎన్నికలపై కార్యకర్తలకు మార్గదర్శనం చేస్తారన్నారు. ఇక్కడి నుండే ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. కాబట్టి ఈ సమ్మేళనానికి ప్రతి ఒక్క కార్యకర్త హాజరై విజయవంతం చేయాలని కోరుతున్నానన్నారు.

కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం పకడ్బందీ వ్యూహంతో ముందుకు వెళుతున్నాం. కేంద్ర ప్రభుత్వం ఏ గ్రామానికి ఎన్ని నిధులు ఇచ్చింది ఏయే అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోందనే అంశంపై పూర్తి వివరాలను గ్రామాల వారీగా వివరిస్తామన్నారు. ఫిబ్రవరి 5 నుండి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో యాత్ర ప్రారంభిస్తున్నానన్నారు. గ్రామాల్లో పాదయాత్ర చేస్తా. సమయాభావాన్ని దృష్టిలో పెట్టుకుని ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి వెళ్లేటప్పుడు మాత్రం వెహికల్ లో వెళతానని, దాదాపు 20 రోజులపాటు యాత్ర కొనసాగిస్తానన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీల్లో పాదయాత్ర చేసి ప్రజలను కలుస్తా కేంద్రం చేసిన కార్యక్రమాలను ఇంటింటికీ వివరిస్తానన్నారు.

### గవర్నర్ పై బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ...

బీఆర్ఎస్ పార్టీనే ప్రజలు రద్దు చేశారు? గవర్నర్ వ్యవస్థను అవమానపర్చిన మూర్ఖత్వపు పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ఒక మహిళా గవర్నర్ ను అసెంబ్లీలో మాట్లాడనీయకుండా అవమానించారన్నారు. గవర్నర్ పర్యటనలకు ప్రోటోకాల్ పాటించలేదు. అధికారులను కూడా గవర్నర్ వద్దకు వెళ్లనీయలేదన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించిన పార్టీ బీఆర్ఎస్. అందుకే ప్రజలు కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు తిరస్కరించారన్నారు. వాళ్ల అహంకారం తగ్గలేదు. ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమల్లోనే ఉన్నారన్నారు? గవర్నర్ అంటే రబ్బర్ స్టాంపులా ఉండాలనుకుంటున్నారు. రాజ్యాంగానికి లోబడి పనిచేసే వాళ్లు వాళ్లకు పనికిరారు. రాజ్యాంగాన్నే మార్చాలని అంబేద్కర్ ను అవమానించారన్నారు. ప్రపంచంలో అత్యున్నత ప్రజాస్వామిక దేశం ఏదంటే ఠక్కున ఇండియా పేరే చెబుతారంటే.. మన రాజ్యాంగం ఎంత గొప్పదో అర్ధం చేసుకోవాలన్నారు.

ప్రపంచంలో అనేక దేశాలు తమ తమ రాజ్యాంగాలను మార్చుకున్నాయి.. కానీ భారత్ మాత్రం రాజ్యాంగాన్ని 105 సార్లు సవరించినా? మౌలిక స్వరూపాన్ని మాత్రం మార్చకుండా చెక్కుచెదరకుండా ఉన్న గొప్పతనం మన రాజ్యాంగానిదే?నన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీది మూడో స్థానమే? ఇంకా గుండా గిరి చేస్తాం.. ఇష్టమొచ్చినట్లు మాట్లాడతామంటే ప్రజలు బీఆర్ఎస్ నేతలపై తిరుగుబాటు చేస్తారు జాగ్రత్త అని బండి సంజయ్ అన్నారు.

# శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు..

**–జాతీయ జెండా ఆవిష్కరించిన చిందం నరసయ్య..**



కరీంనగర్, జనవరి 26:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశానికి స్వతంత్రం వచ్చిన సమయంలో భారతదేశానికి స్వంత రాజ్యాంగం లేదన్నారు. , దేశం కోసం ప్రత్యేక రాజ్యాంగం తీసుకొచ్చారని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26న వచ్చినందున , ఈ రోజును గణతంత్ర దినోత్సవం గా జరుపుకుంటున్నామన్నారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సిరిపురం శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి, మొగిలి, చిందం మహేష్, చిందం అంజి, నరాల ప్రవీణ్, బొంతల కళ్యాణ్ చంద్రతదితరులు పాల్గొన్నారు.

**BEFORE THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM -I ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURTS AT SECUNDERABAD O.P.NO. 288 OF 2023**

Between;
Batthula Tharun Kumar & Another ...Petitioners
AND
Md. Mohin & Others ...Respondents.

To.
1. Md. Mohin, S/o. Md. Moulana Sahib, Aged about: Major, Occ: Driver (Driver of Crime Vehicle Lorry) R/o. H.No.3-3-74/1-A, Pet Basheerabad, Jeedimetla,R.R.dist., T.S.
2.Rahamutulla Shaik S/o. Shaik Hussain Sab, Aged about: Major, Occ: Business. (Owner of Crime Vehicle Lorry) R/o. H.No.1-5-562/1/29, Srisai Nagar, St. Michel School, Old Alwal, Alwal (Malkajgiri) Medchal Mandal, Hyderabad-500 010.
3. Subramanyam Ravi Kumar, S.o. K. Subramanyam, Aged about: Major, Occ: Govt. Employee, (Owner-cum-Driver of Motor Cycle) R.o. F.No. 102, 1st Floor, KPR Residency, Bramarambika Nagar, Malkajgiri, Medchal Mandal, Hyderabad, T.S-500 047.

**NOTICE**

Please take notice that in the above matter the Petitioner had filed a case against you (Respondent No.1 to 3) for compensation of Rs.**30,00,000/-** and the same is posted for your appearance on **2-2-2024.**

You are advised to appear on **2-2-2024** at 10.30 a.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided exparte.

( BY THE ORDER OF THE COURT )

**M/s. BANDI KALAVATHI REDDY (TS/1917/2012) GODUGU KRISHNA**
Advocates
# H.No.3-12-126/1/405, P.S. Residency, P.S. Colony, Ramanthapur, Amberpet, Hyderabad-13.
kalavathireddy61@gmail.com
Counsel for Petitoners.

# పోలీస్ సేవా పథకం అందుకున్న ఏఎస్ఐ.రహమాన్.



సంగారెడ్డి జనవరి 26(నేటి నిజం ప్రతినిధి)జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నషోహబుర్ రహమాన్ పోలీస్ సేవా పథకానికి ఎంపికయ్యారు.

26 జనవరిన సంగారెడ్డిలో నిర్వహించిన గణతంత్ర వేడుకల సందర్భంగా సేవా పథకం, ఉత్కృష్ట సేవ పథకాలతో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి,ఎస్పీచెన్నూరి రూపేష్ ల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ, కలెక్టర్ సంబంధిత ఉన్నతాధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు

**–జిల్లా ప్రజలకు,పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎస్పీ అఖిల్ శుభాకాంక్షలు**



రాజన్న సిరిసిల్ల, జనవరి 26:(నేటినిజం ప్రతినిధి): 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జిల్లా పోలీస్ కార్యాలయంలో, జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఎగురవేశి, జిల్లా ప్రజలకు, జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ

ఎందరో త్యాగధనుల ఫలితమే నేడు దేశ ప్రజలంతా స్వేచ్ఛా వాయువులను ఆస్వాదిస్తూ 75వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని,కావున వారిని ఎప్పుడూ మనం స్మరించుకోవాలని,వారి త్యాగ ఫలం ద్వారా మనం ఈరోజు ఎంతో స్వేచ్ఛగా స్వతంత్రంగా జీవిస్తున్నామని,వారి ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ప్రజలకు రాజ్యాంగం కల్పించిన చట్టం ప్రకారం పారదర్శకతతో ధనిక,పేద అనే తేడా లేకుండా విధులు నిర్వర్తించాలని,అందరినీ సమానంగా చూసి సమన్వయం అందించి ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని అధికారులకు,సిబ్బందికి తెలిపారు .జిల్లా పోలీస్ అధికారులు,సిబ్బంది అందరూ కూడ బాగా పని చేస్తున్నారని అభినందించారు. తెలంగాణ పోలీసులు దేశంలోనే అత్యంత ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్న పోలీసు వ్యవస్థగా మంచి గుర్తింపు సాధించడం జరిగిందని,దానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ సాంకేతికతను అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం సేవపథకాలు పొందిన పోలీస్ అధికారులను, సిబ్బంది ని అభినందించి వారికి సేవపథకాలు అందించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీలు ,ఆర్ఐలు,సిఐ లు,ఎస్.ఐ లు జిల్లా పోలీస్ కార్యాలయాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారిక కార్యక్రమంలో బీహార్ సీఎం నితీశ్ ... డిప్యూటీ సీఎం తేజస్వియాదవ్ గైర్హాజరు

న్యూఢిల్లీ, జనవరి 26: బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ ఆర్జేడీ టాటా చెప్పి తిరిగి ఎన్‌డీఏ కూటమిలో చేరబోతున్నాడని జోరుగా ప్రచారం జరుగుతున్న వేళ మరో కీలక పరిణామం చోటుచేసుకున్నది. ఈ పరిణామం.. నితీశ్ కుమార్ మళ్లీ ఎన్‌డీఏతో జట్టు కట్టనున్నాడనే ప్రచారం నిజమేనేమో అనే అనుమానం కలిగిస్తున్నది.

ఇవాళ బీహార్ రాజధాని పట్నాలోని రాజ్‌భవన్‌లో ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ ఆధ్వర్యంలో జరిగిన ఓ అధికారిక కార్యక్రమానికి సీఎం నితీశ్ కుమార్, మంత్రి అశోక్ చౌధరి హాజరయ్యారు.

కానీ ఆర్జేడీ అగ్రనేత, డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ ఈ కార్యక్రమానికి వెళ్లలేదు. దాంతో ఆర్జేడీ, జేడీయూ కటీఫ్ వార్తలు నిజమేననే అనుమానం కలుగుతున్నది.






Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.